పనులు ముగించుకొని తను ఉన్న వీధికి చేరాడు సీతారాములు. ఒక చెట్టు దిమ్మ వద్ద గుంపుగా జనం ఉండడంతో దగ్గరలో ఉన్న వ్యక్తిని అడిగాడు అక్కడ ఏం చేస్తున్నారని.

'ముసలి వాళ్లకు పింఛన్ ఇస్తారంట. వాటి గురించి వివరాలు సేకరిస్తున్నారు' అని చెప్పాడు అతను.

'అలాగా' అని చేతికర్ర సహాయంతో ఆ గుంపుని మెల్లిమెల్లిగా చీల్చుకుంటూ వివరాలు రాస్తున్న సార్ల వద్దకు చేరుకున్నాడు.

అక్కడ ముగ్గురు వ్యక్తులు కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఇద్దరు సార్లు వివరాలు రాస్తున్నారు. మూడో వ్యక్తి రాంచంద్ర సారు. ఆరు నెలల క్రితం ఓట్ల కోసం ఇంటింటికి తిరిగి 'నాకు ఓటెయ్యండి' అంటూ అడుక్కున్న వ్యక్తి. ఈ వార్డు మెంబరుగా గెలిచిన తరువాత ఇదిగో ఇప్పుడు మొదటిసారిగా ఒక మంచి పని, అదీ నాలాంటి ముసలి వారికి నెల నెల కొంత డబ్బు ఇవ్వడానికి ప్రయత్నాలు... పర్వాలేదు' అనుకోని వార్డ్ మెంబర్ ఎదురుగా వెళ్లి 'నమస్తే బాబు' అన్నాడు.

అలవోకగా 'నమస్తే' అని వివరాలు రాస్తున్న సార్లుకు సాయం చేయడంలో లీనమైపోయాడు.

అక్కడ ఉన్న జనం కేసి చూసాడు సీతారాములు. 'తండ్రి కోసం కొడుకులు సమాధానం చెప్తున్నారు. ఇద్దరో, ముగ్గురో నాలాంటి ఏకాకులు ఉంటారు. నాకు ఒక కొడుకు ఉందేవాడు, ఏం లాభం. వాడికి పెళ్లి చేసేంతవరకూ నా సంకెక్కాడు. తరువాత దాని వాళ్లో పడుకున్నాడు. పెళ్లాం మాటలు విని మాకు దూరంగా వెళ్లిపోయాడు. ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో ఇంతవరకూ రాకపోకలే లేవు.'

ఎవ్వరో వెనుకనుంచి నెట్టగానే ముందుకు తూలాడు. ఆలోచన నుంచి తేరుకొని 'ఎవ్వడ్రా' అని అరిచాడు. ఎవ్వరూ మాట్లాడకబోయేసరికి అటు ఇటు చూసి ఒక అడుగు ముందుకు వేసి, సార్ల కెళ్లి చూస్తూ ఉండిపోయాడు.

కొద్దిసేపటి వరకు ఓపిక పట్టిన సీతారాములు, తన గురించి అడగకపోయేసరికి 'బాబూ కొంచం నా గురించి కూడా పట్టించుకోండి' అన్నాడు.

రాస్తున్న సార్లలో ఒకతను [illegible] పైకెత్తి సీతారాములను చూస్తూ 'రాస్తున్నాం [illegible] తాతా, కొద్దిసేపు నిలుచో' అన్నాడు.

అరగంట తరువాత సీతారాములు వంతు వచ్చింది.

'ఇప్పుడు చెప్పు తాతా, నీపేరేంటి?'

'సీతారాములండి.'

'నీ వయస్సెంత?'

'ఉంటదయ్య అరువై ఐదు.'

'ఇంతక ముందు ఏం పని చేసావు, ఇప్పుడు ఏమి చేస్తున్నావు?'

'సైకిల్ మీద బట్టలు పెట్టుకోని ఊరూర తిరిగి అమ్మేవాడిని. ఇప్పుడు ఓపిక లేక దగ్గర్లో బడి ముందు బిస్కెట్లు, చాక్లేట్లు అమ్ముతున్నాను'.

మరి కొన్ని వివరాలు రాయడం పూర్తి అవ్వగానే 'నీ వివరాలు రాయడం అయిపోయింది తాతా. పక్కకు జరుగు' అని రాస్తున్న సారు అన్నాడు.

ఉండబట్టలేక 'డబ్బులు ఎప్పుడు ఇస్తారు బాబు' అని రాస్తున్న సార్ని అడిగాడు సీతారాములు.

మోడెపల్లి ఓంకారాచారి




'ఇప్పుడే కదా తాత రాసింది. మెల్లగా వస్తాయిలే' మరో వ్యక్తి వివరాలు రాస్తూ అన్నాడు సారు.

'బాబు, ఎంత ఇస్తారు.'

'మూడు వందలో, నాలుగు వందలో ఇస్తారు.'

సీతారాములికి మరొక్క ఆలోచన వచ్చి 'సార్ నా భార్య రత్తమ్మది కూడా రాసుకోండి' అని అడిగాడు.

'నీ పేరు రాపించావు కదా, మళ్లీ అవ్వ పేరెందుకు?' అడిగాడు పక్కన ఉన్న పాతిక సంవత్సరాల యువకుడు.

'వెర్రి వెధవా! ఇద్దరి పేర్లు రాపిస్తే డబ్బులు ఇద్దరికీ వస్తాయి కదా?' అన్నాడు.

రాస్తున్న సార్ పక్కన కూర్చున రాంచంద్ర సారు 'ఫ్రీగా వస్తే ఫినాయిల్‌ని కూడా కుటుంబం మొత్తానికి పంచమనేటట్టు ఉన్నావే' అన్నాడు. అక్కడ ఉన్న జనం ఫక్కున నవ్వారు.

అదేమీ పట్టించుకోకుండా 'నీవు రాయి బాబూ' అని రత్తమ్మ వివరాలు చెప్పాడు సీతారాములు.

అందరి వివరాలూ సేకరించిన తరువాత రాంచంద్ర సారు నిల్చుని, అక్కడ ఉన్న జనంను ఉద్దేశించి 'మేము ఎప్పుడు కబురు చేస్తే అప్పుడు మునిసిపల్ ఆఫీస్‌కు రావాలి' అని చెప్పి వెళ్లిపోయారు.

కొన్నిరోజుల తరువాత ఆ వీధికి స్పీకర్ కట్టిన ఒక రిక్షా వచ్చింది. 'పింఛన్ కోసం దరఖాస్తులు చేసిన వారు రేపు ఉదయం తొమ్మిది గంటలకు మునిసిపల్ ఆఫీస్‌కు రావాలి' అని అనౌన్స్ చేసారు.

ఆ మాటలు విన్న సీతారాములు సంతోషంగా రత్తమ్మ దగ్గరకు వెళ్లి 'రేపు మనకు డబ్బులు ఇస్తారంటా, పెందలకాడె ఆఫీస్‌కు వెళ్లాలి' అని చెప్పాడు.

మరుసటి రోజు ఉదయానే లేచి, చకచక తయారై ఇనుపపెట్టలో ఉన్న కొత్త బట్టలు వేసుకొని మున్సిపల్ ఆఫీస్‌కు బయలుదేరాడు.

మధ్యదారిలో బట్టల దుకాణంకెళ్లి, పండ్ల బండ్ల కెళ్లి చూస్తూ 'చేతికి డబ్బులు రాగానే రత్తమ్మకు ఒక చీర తీసుకోవాలి. చాన ఏళ్లైంది పండ్లు తినకా, వీటిని కూడా తీసుకోవాలి' అని మనస్సులో ఆశపడుతూ వెళ్లాడు.

చీమలు కూడ దూరలేనంత జనంతో కిక్కిరిసి పోయింది మునిసిపల్ ఆఫీస్. కొద్దిసేపటి తరువాత ఎమ్.ఎల్.ఎ. గారు వచ్చి మైకులో కొద్దిసేపు మాట్లాడారు. మరో ముగ్గురు నాయకులు కూడా మాట్లాడారు. అది చేస్తాం, ఇది చేస్తాం అన్నారే తప్ప ఇప్పుడు ఇవ్వవలసిన డబ్బుల గురించి మాత్రం మాట్లాడలేదు.

కొద్దిసేపటి వరకూ ఓపిక పట్టిన సీతారాములు నాయకులు చెప్పే హామీలు వినలేక కంటి చూపు దగ్గర్లో ఉన్న సార్ దగ్గరకు వెళ్లి 'డబ్బులు ఎప్పుడు ఇస్తారు' అని అడిగాడు.

క్షణం ఆలోచించకుండా 'ఏం డబ్బులు?' అని తెలియదు అన్నట్టు అన్నాడు.

ఒకేసారి ప్రాణం పోయినంత పనైంది సీతారాములకు.

'పింఛన్ డబ్బులు బాబు' అన్నాడు.

'పింఛన్ డబ్బులా? ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తాయో తెలియదు.' అని చెప్పి, ఎవ్వరో పిల్వగానే వెళ్లిపోయాడు.

ఆశలన్నీ నిరాశగా మారడంతో తూలుకుంటూ ఇంటికి చేరాడు సీతారాములు. రత్తమ్మ ఎదురుగా వచ్చి 'ఏమైంది అయ్యా డబ్బులు తీసుకున్నావా' అడిగింది.

'ఏందే తీసుకునేది. గంటల తరబడి ఎండలో నిల్చోబెట్టి చివరికి డబ్బుల ఊసే ఎత్తలేదు. ఎప్పుడు ఇస్తారు అని అడిగితే ఇంకా రాలేదు, ఎప్పుడు వస్తాయో తెలియదు అని బదులు చెప్పారు. పాణం అలసటగా ఉంది కొన్ని మంచినీళ్లు ఇవ్వు'.

రత్తమ్మ మంచినీళ్లు తీసుకువచ్చి ఇచ్చింది. ఒకే గుటకలో లోటాలో ఉన్న నీళ్లు మొత్తం తాగి మంచంమీద కూలబడ్డాడు.

వారం రోజుల తరువాత మళ్లీ పిలుపు. 'ఈసారైనా ఇస్తారేమోనని ఆశగా వెళ్లాడు. మళ్లీ సీతారాములకు నిరాశే మిగిలింది.

రత్తమ్మ జబ్బున పడింది. పక్కింటి వారి వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకొని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ డాక్టర్లు రోగిని పరీక్షించడానికి ఉచితమేగాని, మందుగోలీలు, సూదులు, టానిక్‌లు మొత్తం బయటే కొనాల్సి వచ్చింది. మెల్లిమెల్లిగా సీతారాముల చేతిలో ఉన్న డబ్బులు అయిపోయాయి. రత్తమ్మ జబ్బు మాత్రం తగ్గలేదు. జబ్బు ముదిరి మంచంమ్మీదే ప్రాణాలు వదిలేసింది రత్తమ్మ.

విషాదంతో వంటరివాడు అయ్యాడు సీతారాములు.

మునిసిపల్ ఆఫీస్ నుంచి పిలుపు...

"ఎవడు వెళ్తాడు అంత దూరం. గంటల కొద్దీ వాళ్లు చెప్పే సోది వినే ఓపిక నాకు లేదు' అనుకొని మంచమ్మీద పడుకున్నాడు. 'ఒకవేళ డబ్బులు ఇస్తే చేజారిపోతాయి... అప్పు అన్నా తీరుతుంది' అని మళ్లీ అనుకొని మంచమ్మీద నుంచి లేచి ఆఫీస్‌కు వెళ్లాడు.

'డబ్బులు వచ్చాయి' అని ఎవ్వరో అంటుంటే విని 'హమ్మయ్య...' అనుకొని, పోయిన ప్రాణం తిరిగి వచ్చినంత సంతోషంగా పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు సీతారాములు.

గంట తరువాత 'రత్తమ్మ, రత్తమ్మ' అని గుమాస్తా కంచుకంఠంతో పిలుస్తూంటే –

'నా భార్యండి' అంటూ గుమస్తా దగ్గరకు వెళ్లాడు సీతారాములు.

'రత్తమ్మ పేరు మీద పింఛన్ డబ్బులు వచ్చాయి. ఆమె సంతకం పెడితే డబ్బులు ఇస్తారు. వెళ్లి ఆమెనుతీసుకురా?' గుమస్తా చెప్పాడు.

'నా పేరు మీద రాలేదాయ్యా'

'ఒక ఇంట్లో ఒక పేరు మీదే వస్తాయి. త్వరగా వెళ్లి రత్తమ్మను తీస్కొనిరా'

'ఆమెను తీసుకురావాలంటే నేను ఆమె దగ్గరకు వెళ్లాలయ్యా'

'త్వరగా వెళ్లు'

'ఆమె దగ్గరకు వెళ్లితె, తిరిగి వచ్చేది లేదయ్య ఇంక అటే'

'అదేంది'

'నా భార్య రత్తమ్మ చనిపోయింది'

'అలాగా' అని కొద్దిసేపు మౌనంగా ఉండి 'ఆమె పేరుమీద వచ్చిన పింఛన్ నీపేరు మీదకు మార్చుకో'

'మరి మార్చండి'

'ఇప్పుడు కుదరదు. తరువాత రా'

'మార్చడానికి, మీరు నా చేతికి డబ్బులు ఇవ్వడానికి ఎన్ని రోజులు పడుతుంది.

'పడుతుంది, ఆరునెలలే పట్టొచ్చు, సంవత్సరం పట్టొచ్చు, లేదా రెండు సంవత్సారాలే పట్టొచ్చు చెప్పలేం... ఎప్పుడు వస్తాయో.'

'అలాగా' అని మౌనంగా బయటకు వచ్చేసాడు సీతారాములు.

ఒకసారి వెనుకకు తిరిగి ఆఫీస్‌కేసి చూస్తూ 'వీళ్లు ఇచ్చే పింఛన్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే వీళ్లు నా చేతికి ఇచ్చేలోపల నా ప్రాణం కూడా గాలిలో కలిసిపోతది. సచ్చేలోపల అప్పులు తీర్చాలి. లేకపోతే నేను పోయిన తరువాత కూడా ఇచ్చిన వాళ్లు తిడుతూనే ఉంటారు. పైన కూడా ప్రశాంతంగా ఉండలేను. కష్టపడినన్ని రోజులు కష్టపడి పని చేస్తా. ఆ తరువాత పైన ఉన్న దేవుడే శరణం.' ●